యువత భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు

యాచారం, మే 25 : యువత భక్తి భావాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్కీజ్‌గూడలో కామరాతి సమేత బీరప్ప స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆయన ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో భక్తి భావం ఉట్టిపడేలా ఆలయాలు నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష, నాయకులు గుండెల్లి మల్లేశ్, డేరంగుల శంకర్, బోడ అబ్బయ్య, పాండు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పేదలకు అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, మే 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కడ్తాల్ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 1,600 మంది నిరుపేదలు దరఖాస్తు చేసుకుంటే 60 మందిని మాత్రమే ఎంపిక చేసి కాంగ్రెస్ నాయకులు చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు రాని లబ్ధిదారుల జాబితా, దరఖాస్తుల తిరస్కరణకు కారణమైన అంశాలను గ్రామాల వారీగా పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను తుంగలోకి తొక్కిన ప్రభుత్వం, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకే ఇందిరమ్మ ఇండ్లు అంటూ కొత్త నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు కడారి రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు రామచంద్రయ్య, ఇర్షాద్, వెంకటేశ్, నాగార్జున, మహేశ్, కృష్ణ, భాస్కర్, మహేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆవులను తరలిస్తే సమాచారం ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భూపాల్ శ్రీధర్

చేవెళ్లటౌన్, మే 25 : బక్రీద్ పండుగకు ఎవరైనా అక్రమంగా ఆవులను తరలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గోరక్షకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకతీతంగా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవన్నారు. సరైన పత్రాలు లేకుండా పశువులను ఎవరైనా తరలించినట్లు తెలిస్తే 8712663441, 8712663442 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- ప్రత్యేక పాలనలో రోడ్లపై పారుతున్న మురుగు
- వృద్ధి చెందుతున్న ఈగలు, దోమలు
- రోగాలకు నిలయంగా గ్రామాలు
- పట్టించుకోని అధికారులు

యాచారం మండలంలోని నానక్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు

ఇబ్రహీంపట్నం, మే 25 : పల్లెల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించే నాథుడే లేడు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో పారిశుధ్య ఇబ్బందులు లేకుండా చూశారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చేయడంతో సీజనల్ వ్యాధులు రాకుండా తె లంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హ యాంలో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం పడకేసింది. చెత్తను సేకరించే వాహనాలు రాక పోవడంతో ఇండ్లల్లోనే పేరుకుపోతున్నది. మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో రోడ్లపై పారుతున్నది. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలకు నిలయంగా మారుతున్నది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 87 పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించినా వారు ఎప్పుడు వస్తున్నారో... ఎప్పుడు పోతున్నారో తెలియని అయోమయ స్థితిలో రోగాల భారిన పడుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో విష జ్వరాలు వస్తుండడంతో పేదలు ప్రభుత్వ దవాఖానకు వెళ్తున్నా సరైన మందులు, వైద్య చికిత్సలు అందడం లేదని వాపోతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులతో పాటు అభివృద్ధి పనులకు ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేశారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయి. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడినప్పటి నుంచి కొనసాగుతున్న ప్రత్యేకాధికారుల పాలనలో కేవలం ఒక్కరూపాయి కూడా కేటాయించిన దాఖలాలు లేవు. గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వాహణ పట్టించుకునే వారే కరువయ్యారు.

- చిలుకల యాదగిరి, మాజీ సర్పంచ్, తులేకలాన్

కనిపించని ప్రత్యేకాధికారులు

ప్రత్యేకాధికారుల పాలనలో ప్రతిరోజు గ్రామానికి రావాల్సిన ప్రత్యేకాధికారులు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రతి రోజు గ్రామ పంచాయతీల వద్ద ప్రజలు వేచి చూస్తున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మాకు టైంలేదు... మేము వచ్చినప్పుడు సంతకాలు పెట్టించుకోవాలనే రీతిలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. కాంగ్రెస్ సర్కారులో అధికారులకు బాధ్యత, భయం లేకుండా పోయాయి.

-శ్రీనాథ్, నానక్‌నగర్

నేషనల్ క్రికెట్ లీగ్ సౌత్ జోన్ విజేతగా తమిళ నాడు

సత్యసాయి నేషనల్ క్రికెట్ లీగ్ సౌత్ జోన్ ఫైనల్స్ కప్ గెలుచుకున్న తమిళ నాడు సౌత్ జోన్ జట్టు

తుర్కయాంజాల్, మే 25 : మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నేషనల్ క్రికెట్ లీగ్ సౌత్ జోన్ పోటీలు ఈ నెల 23 నుంచి నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తమిళనాడు సౌత్ జట్టు తెలంగాణ జట్టుతో పోటీ పడింది. తమిళనాడు జట్టు విజేతగా నిలువగా, తెలంగాణ జట్టు రన్నరప్‌గా నిలిచింది. జోనల్ లెవల్‌లో నెగ్గిన జట్ల మధ్య ఆగస్టు 15 నుంచి 17 వరకు పుట్టపర్తిలో జరిగే యూనిట్ కప్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి సంస్థల సభ్యులు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌కు మాజీ అంతర్జాతీయ అంపైర్ వీకే రామస్వామి, మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్, సత్యసాయి సేవా సంస్థల జోనల్ అధ్యక్షుడు ముకుందన్, సత్యసాయి నేషనల్ క్రికెట్ లీగ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గోపీకృష్ణ, సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ అధ్యక్షుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణ దానంతో సమానం

రక్తదాన శిబిరంలో 4కే ఫిట్‌నెస్‌క్లబ్ నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, మే 25 : రక్తదానం ప్రాణదానంతో సమానమని పట్టణంలోని 4కే ఫిట్‌నెస్ క్లబ్ నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి అన్నారు. ది వ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు భుజంగారెడ్డి ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ క్లబ్‌లో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు రఘువీర్‌రెడ్డి, వంశీ, వేణుగోపాల్, భరత్, నవీన్, భాను, మధుసూదన్‌రెడ్డి, ఉదయ్, సాయి, అజ్మీర్, రఫీక్, సాత్విక్, సురేశ్, చరణ్, కృష్ణమోహన్, సతీశ్ పాల్గొన్నారు.

ముందే దర్శన మిచ్చిన ఆరుద్ర పురుగులు

యాచారం, మే 25 : ఆరుద్ర కార్తె అనగానే ప్రతి ఒక్కరికీ టక్కున గుర్తుకొచ్చేది అందరూ రైతు మిత్రులుగా భావించే ఆరుద్ర పురుగులు. అలాంటి ఆరుద్ర కార్తెలో కనిపించే ఆరుద్ర పురుగులు ఈ సారి ముందే దర్శనమిచ్చాయి. మండల పరిధి లో ఇటీవల కురిసిన వర్షాలకు ఒక్క సారిగా వాతావరణం చల్లబడడంతో నల్లని నేలపై ఎర్రని రంగులో నిగనిగలాడుతూ ఆరుద్ర పురుగులు కనువిందు చేస్తున్నాయి. ఆరుద్ర పురుగులు కనిపిస్తే రైతులకు శుభ సూచకమని, వర్షాలు పుష్కలంగా కురుస్తాయని రైతుల నమ్మకం. మండలంలోని మేడిపల్లిలో రైతులకు దర్శనమివ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కళాకారులకు ప్రతి నెలా పింఛన్ ఇవ్వాలి

ఐపీటీఏ ఆవిర్భావ దినోత్సవంలో సంఘాల నాయకులు

పెద్దఅంబర్‌పేట, మే 25 : తెలంగాణ ప్రజా నాట్యమండలి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డీ వేణుగోపాలాచారి అధ్యక్షతన ఐపీటీఏ ఆవిర్భావ దినోత్సవాన్ని మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరు రావినారాయణరెడ్డి కాలనీ ఫేస్-2లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్‌నాయక్ ఐపీటీఏ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, మలి దశ తెలంగాణ ఉద్యమంలో కళాకారులు ముఖ్యపాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో వృత్తి కళాకారులకు గుర్తింపు లేక జీవనాధారం కష్టంగా మారిందని, ప్రభుత్వం వారికి ప్రతి నెలా పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో చైతన్యం నింపేలా కళారూపాలు తయారు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు సైదులు, రాము, శేఖర్, భాస్కర్, సరస్వతి, విజయ్, అడివయ్య, సావిత్రి, శైలజ, మహేశ్, పరశురాములు, రమేశ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

షాబాద్, మే 25 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని మద్దూరు మాజీ సర్పంచ్ పట్లోళ్ల నరేందర్‌రెడ్డి, సహకార సంఘం మాజీ డైరెక్టర్ రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మద్దూరులో దివంగత నేత పట్లోళ్ల లక్ష్మీరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు 15 రోజులుగా ఎంపీఎస్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి హైదరాబాద్ సర్ జట్టుకు రూ.లక్ష నగదు, మెమోంటోను, రెండో బహుమతిగా ముంబాయి జట్టుకు రూ.25 వేల నగదు, మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయన కుమారులు శ్రీనివాసరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రవినాయక్, నాయకులు సుధాకర్ గౌడ్, బాలీ యజ్ఞయాదవ్. దిగ్నేస్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

సిటీ సబర్బన్ బస్సులు నడపాలి

కడ్తాల్, మే 25 : హైదరాబాద్ నుంచి ఆమనగల్లు వరకు సిటీ సబర్బన్ బస్సులను నడపాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతాముదిరాజ్ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం ఆమనగల్లు, కడ్తాల్ మండలాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తారని, ప్రయాణికుల కోసం ఆమనగల్లు వరకు సిటీ సబర్బన్ బస్సులను నడపాలని కోరినట్లు ఆమె తెలిపారు. అలాగే కడ్తాల్‌లో ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని, కడ్తాల్-షాద్‌నగర్ మార్గంలో నిలిపిన ఆర్టీసీ బస్సులను వెంటనే నడిపేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఆమె వెంట ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ ఉన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 25 : మండల పరిధిలోని గండిచెరువులో సోమవారం ఉదయం 8 గంటలకు గ్రామ పంచాయతీ వద్ద 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి పల్లవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు హాజరై వ్యవసాయంపై పలు సలహా సూచనలు చేస్తారని తెలిపారు. రైతులకు వ్యవసాయ పద్ధతులపై ఎలాంటి సందేహాలు ఉన్నా తెలుసుకోవచ్చన్నారు. గ్రామంలోని రైతులందరూ సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులకు ఇండ్లు ఇచ్చేందుకు కృషి

కొత్తూరు, మే 25:మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులు, కొత్తూరు తండా లో ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆరో వార్డులో హైటెన్షన్‌వైర్ల మళ్లింపు ప్రక్రియ పూర్తి చేసినందుకు ఎమ్మెల్యేకు కౌన్సిలర్ హేమాదేవేందర్ అభినందన సభ ఏర్పాటు చేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మాడ్గుల : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాడ్గుల, మే 25 : మండల పరిధిలోని కల కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010-11లో చదివిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీవీ రావు, ఆంజనేయులు, చాందు పాషా, సత్యరాం, రమేశ్, పరాంధం, సుందర్, ముత్యపు రెడ్డి, విద్యార్థులు రాజు గౌడ్, శివలింగం, ప్రసాద్, సాయిరాం, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్వేద జడ్పీహెచ్ఎస్‌లో..

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి మండల పరిధిలోని పర్వేద జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు 20 ఏండ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఆదివారం 2005- 06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తాము చదువుకున్న స్కూల్ లోనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవడంతో పాటు ప్రస్తుత ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ యోగక్షేమాలను ఒకరి కొకరు అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.

చేవెళ్ల రూరల్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకోరా?

మాడ్గుల, మే 25 : మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద ఉన్న మినీ వాటర్ ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతున్నది. సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఎవరూ పటించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తలకొండపల్లి మండల పరిధిలో సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే తలకొండపల్లిలో తొలి మహిళా కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ఆవిష్కరణలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్, కుమ్మరి సంఘం మండలాధ్యక్షుడు దుగ్గాపురం నాగేశ్ పాల్గొన్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లిలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవితో కలిసి ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. **- కడ్తాల్/ఆమనగల్లు మే 25**

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

- కుర్వగూడలో ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు
- వేర్వేరు ఘటనల్లో మరో ఇద్దరు మృత్యువాత

ప్రభుత్వ లాంచనాలతో విజయ్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

షాబాద్, మే 25 : శంషాబాద్ మండల పరిధిలోని పెద్దషాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ దాచె విజయకుమార్ (40) మృ తి చెందాడు. ఆయన అంత్యక్రియలు ఆదివారం షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడలో ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్, శంషాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, శంషాబాద్, షాబాద్ సీఐలు నరేందర్‌రెడ్డి, కాంతారెడ్డి, శంషాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, విజయ్ కుమార్ 2006 బ్యాచ్‌మెంట్స్ పాల్గొని నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతుడు హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్‌కు భార్య స్వాతి, ఇద్దరు కుమారులు అశ్వద్, ఆరిహంత్, తల్లిదండ్రులు ఉన్నారు. ఆయన తండ్రి రిటైర్డ్ ఉద్యోగి. దీంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. విజయకుమార్ మరణవార్త తెలియగానే స్వగ్రామమైన కుర్వగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి మృతి

గోపయ్య (ఫైల్)

మాడ్గుల : మండల పరిధిలోని కొల్కులపల్లిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కలకొండ గ్రామానికి చెందిన మేకల గోపయ్య (23), స్నేహితుడు మహేశ్‌తో కలిసి కలకొండ నుంచి మాల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. కొల్కులపల్లికి రాగానే మాల్ నుంచి వస్తున్న పాల వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని మాల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా గోపయ్య మృతి చెందాడు. గోపయ్య తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వేణుగోపాల్ తెలిపారు.

స్కూటర్‌పై నుంచి పడి మహిళ..

చేవెళ్ల రూరల్ : స్కూటర్ పై నుంచి జారి పడి మహిళ మృతి చెందింది. ఎస్సై శిరీష తెలిపిన వివరాలు.. చేవెళ్ల మున్సిపాలిటీలోని ఇబ్రహీంపల్లికి చెందిన మంగలి లక్ష్మి (32) వివేకానంద స్కూల్‌లో ఆయాగా పని చేస్తున్నది. ఆదివారం స్కూల్‌లో ప్రోగ్రాం ఉండడంతో ఉదయం 8.30 గంటల సమయంలో మున్సిపల్ కేంద్రానికి వచ్చింది. అప్పటికే స్కూల్ బస్సు వెళ్లిపోవడంతో అటుగా స్కూటర్ పై వెళ్తున్న మహేందర్ అనే వ్యక్తిని లిఫ్ట్ అడిగింది. అతను ఆమెను ఎక్కించుకొని అయ్యప్ప టెంపుల్ వద్దకు వెళ్లగానే.. లక్ష్మి ప్రమాదవశాత్తు జారి కింద పడింది. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే మహేందర్ రెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త మంగలి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు

కంకరతో శ్రీనివాసులగూడ, ఈదులపల్లి రోడ్డు

నందిగామ, మే 25 : మండల పరిధిలోని మాజీద్‌మామిడిపల్లి నుంచి ఈదులపల్లి వయా శ్రీనివాసులగూడ వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.95 కోట్లతో బీటీ రోడ్డును మంజూరు చేసింది. రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్న క్రమంలో ఎన్నికలు రావడంతో కంకర వరకు వేశారు. ప్రభుత్వం మారడంతో అధికారులు, పాలకులు రోడ్డును పట్టించుకోకపోవడంతో బీటీ వేయకుండా వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి బీటీ వేయాలని శ్రీనివాసులుగూడ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మహా ధర్నాకు తరలిరావాలి

మహాధర్నాకు సంబంధించి కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మాడ్గుల, మే 25 : రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఈ నెల 30న నిర్వహించే మహాధర్నాకు వ్యవసాయ, ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. ఈ ధర్నాకు కూలీలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యధర్శి పాషా, దశరథ, సాగర్, చంద్రయ్య, రామస్వామి, జంగయ్య, రాములమ్మ, లక్ష్మమ్మ, అలివేలు, కృష్ణయ్య, లక్ష్మయ్య, యాదమ్మ, సాయిలు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాలకు విరాళం అందజేత

షాబాద్, మే 25 : మండల పరిధిలోని ఆస్పల్లిగూడలో ఆదివారం బీరప్ప ఉత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డితో కలిసి పూజలు చేశారు. అనంతరం బీరప్ప ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులకు రూ.51వేలు విరాళంగా అందజేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 25 : ఫొటోగ్రాఫర్లపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రేటర్ హైదరాబాద్ ఫొటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్క సంజీవ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 21న అనాజ్‌పూర్‌లోని వైఎల్ఆర్‌గార్డెన్‌లో ఓ వివాహంలో ఫొటోగ్రాఫర్లపై జరిగిన దాడిని నిరసిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆదివారం ఫొటోగ్రాఫర్లు ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న ఫొటోగ్రాఫర్లు అనిల్, నర్సింహాలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. దాడిలో రూ. 4లక్షల విలువైన కెమెరాలు, లెన్స్‌లను ధ్వంసం చేశారన్నారు. ర్యాలీ అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫొటో, వీడియోగ్రఫి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారెడ్డి, గ్రేటర్ ఉపాధ్యక్షుడు ఎండీ నవాజ్‌పాషా, ఓల్డ్ సిటీ అసోసియేషన్ అధ్యక్షుడు రాము, తుర్కయాంజాల్ మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేశ్, దిల్‌సుఖ్‌నగర్ అధ్యక్షుడు శ్రీనివాస్, అబ్దుల్లాపూర్‌మెట్ మాజీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌ